# "గాయింత మడిసెక్కవోతెట్ల...?"

చెరువు మొకాన పోతున్న నేను కుమ్మరి రామయ్య లొల్లివెట్టుడిని బజార్లట్లనే నిల్సున్న. ఊరవిసికంతున్న[57] రామయ్య ఊసిపోతున్న గోసిని సదురుకుంట అటీటురుకుతుండు. బుర్రుపిట్టోలె ఎగురుతండు. కొడుకుల మీదిమీది కురికత్తండు.

"లమ్డి కొడుకుల్లార! భూమిని అమ్ముతార్ర? భూమినమ్ముతె పెండ్లాన్నమ్ముకున్నట్రా! తల్లినమ్ముకున్నట్టేర్రా! మీరు నాకేమియ్యకుంర్రి. గీ మడిసెక్కను నేంజచ్చినా అమమ్మనియ్య. అవ్వో! కొడుకు లుద్దరిత్తరనుకున్న. గిన్నేండ్లవట్టి సవురచ్చన సేసుకుంటచ్చిన భూమిని. గియ్యాల్ల గీ బూమిని కొడుకులెదిగినంక అమ్ముతరట. నా కడుపుల సెడపుట్టింర్రురా. ఛీ నీ యవ్వ! లమ్డికొడుకుల్లార నా కండ్ల ముంగటికెల్లి ఎల్లిపోంర్రి" కొడుకులందిట్టుకుంట అటిటు నడుత్తండు రామయ్య.

"ఊకో......ముసలోడ. ఒర్రితివాంటె మెడలు విసుకుత సప్పుడు జేకుండు" అన్నడు పె కొడుకు.

"పిసుకురా ఇగో పిసుకు" అని పెద్దకొడుకు దగ్గెరి కురికచ్చిండు రామయ్య.

"మిమ్ములకన్నది, పెంచింది మీతోని మెడలు పిసికించుకునటానికే కదు. నేం జచ్చినంక గా బూమమ్ముకోంర్రి. నాకండ్లముంగట అమ్మనియ్య" అన్నడు.

"నాయిన్నా? నువ్వు కొద్దిగాగె. మేం జెప్పేదరుతం జేసుకో. గదాండ్లేమన్న పంటత్తందా సెప్పు? దానిమీది బాకీల కింది మిత్తికే అదిపోతది". మల్ల అన్న నేను "ఇద్దరమిక్కడ ఉంటలేకపోతిమి. గా పొలాన్నెవ్వలు సేత్తరు సెప్పు? కయికిలివెట్టి దున్నిచ్చి, పంటేత్తె పెట్టువడి మందమన్న పంటత్తందా సెప్పు" సిన్నకొడుకు.

"అండ్ల పండనియ్య. పండకపోనియ్య. నేనమ్మనియ్య. నా మనున్నంతదాక[58] గా బూమి గట్లనే ఉండాలె. ఏం జేత్తరో సేసుకోంర్రి గాడ్దికొడుకులార" అని బూతుల్దిడుతండు రామయ్య.

నేం బోయక్కడ నిల్సున్న.

"ఏంది! కొడుకులతోనెందుకో కొట్లాడుతన్నవు. బాగ గరంగున్నట్టున్నవు?" అన్న.

"ఎంటికెలున్న కొప్పు ఎటుముడ్సినా అందమంటరు. తెల్లగుంటె సేతులిన్నన్ని పైసలుండె సెప్పినట్టేంటరు. ఇగో గి బొక్కలెల్లున్న బక్కోని మాటలెవ్వలింటరే? కొడుకయితేం దెవ్వడయితేంది?' అన్నడు అంగిలేపి సూపుకుంట రామయ్య.

"సరెగని ఎందుగ్గిట్లా కొట్లాడుతండ్రు?" అనడిగిన.

"సూడు బిడ్డ. గా కాసెగుండ్లల్ల మడిసెక్క లేదా? గదాన్ని అమ్ముతనంటున్రు్రడీల్లు. గదానికోసురం నేనెంత కట్టపడ్డనో ఎరికేనా? పట్వారి పంతులు పరంపోగు జూపెట్టిండు. గప్పుడదట్టి బీడే. అండ్లనే గుడిసేసుకోని గి సేతుల్తోనే గా బీడునంత పాతం జేసిన. కంపును గొట్టేసిన. అండ్లున్న రాల్లనేరేసిన. తుప్పలను పీకేసిన. పెండేరుకచ్చుండ్ల పడేసిన. రొండు బక్కాట్ని గొన్నటెనుక. నాగలి గూడండ్లకు సొర్రలే. రోజు సాపెలుపన్న దున్నుడు గాలే. గదాన్ని దున్నుటానికి ఐదారు నాగల్దుంపలిరిగినయి. ఎడ్లు ఈడిగ్గిల పడుకుంటిగ్గినై."

"గా పొలంల నా సెముంటుంది. గండ్ల నా రగుతముంది, నా పానముంది, సకులముంది.[59] గదాన్ని మూడేండ్లు దుంతె రేవుకచ్చింది. అటెనుకటేడు అండ్ల వండినయి. అండ్లకే అయినయి. అటెనుక గిన్నన్ని రాల్తన్నయి. గా దామెరచెర్లకు నీల్లచ్చినంక ఇన్నన్ని ఇత్తులు పండుతన్నయి. గసొంటి నా పానంకంటెక్కో సూసుకున్న. బూమిని ఎన్ని కట్టాలచ్చినా గని ఇడిసిపెట్టలే. ముప్పయేండ్లవట్టి దక్కిచ్చుకుంటచ్చిన. గదాన్ని కొడుకు లెదిగినంక అమ్ముతనంటండ్రు. ఉన్నదే గా మడిసెక్క. గాయింత వోతెట్లన్న" అన్నడు రామయ్య.

"బూమ్మీన ముసలయినెకు గంత పేముంది గద. ఉంచక ఎందుకనమ్ముతండ్రు" అన్న నేను రామయ్య కొడుకుల్తోని.

"నీ కడుపు సల్లగుండ. నీ కడుపుల గంపెడుమంది పొల్లగండ్లు పుట్ట! గట్ల ముడ్డీమీద తన్ను గాడ్డికొడుకులను. బూమమ్ముతరట బూమి" అన్నడు.

"అదిగాదె మల్లన్నా! నేనేమొ హుజురాబాదుల శెపరాశి నౌకరి జేత్తన్న. తమ్ముడేమో మందమర్రిల పనిజేత్తండు. నాయిన్నకు సాతగాకుంటయింది. గా బూమినెవ్వలు జూడాలె సెప్పు? పొల్లకిత్తె మన్నుగూడ వత్తలేదు. దున్నిత్తె కయికిలన్న పడుతలేదు. ఆ బూమ్మీన సేసిన అప్పులు మస్తుగున్నయి. దాన్నమ్ముతె అప్పుల్దీరుతయి" అన్నడు పెద్దకొడుకు.

"ఎట్ల మాట్లాడుతండు సూడు కొడుకు! బాకీలుంటె మీకు నౌకర్లు లెవ్వా? మీ నౌకర్ల పైసైతొక్కటియ్యనంటరు. ఉన్న మడిసెక్కనమ్మతనంటరు కాదురకొడుః! ఎంత సక్కటి కొడుకులు పుట్టింద్రురా?" అన్నడు రామయ్య.

"ముసలయినవన్నట్టు పెరికొంత బాకి గట్టలేరు" అన్న నేనాల్లతోని.

"మాటలనుదు అలుకనే మల్లన్న. కని సెయ్యన్నంటె కట్టం. నాకు శెపరాశి నౌకర్తోని ఐదారు నూర్లత్తయి. తమ్మునికి నెలకెనిమిది నూర్లత్తయి. గీ జీతంతోని పొల్లగండ్ల సాదుకుంట బాకిగట్టన్నంటెట్ల ఎల్లుతదో సెప్పు మల్ల గీ బూమిల గిప్పుడేం పండుతలేదు. అదిప్పుడరుద గొట్టుడుకుంది. అదుంటె నాయిన్న సాతగాకున్నా అటు వోతడు. ఎట్లనో బాకిజేసి గడ్డామన్న ఇదో రంది. గందుకనే అమ్ముతనంటున్నం" అన్నడు పెద్దకొడుకు.

వాళ్ల మాటల్ల గూడ నిజమున్నట్టనిపించింది. కని రామయ్యకా బూమ్మీన పానముంది. దాన్నసలే ఇడువన్నని లేదు.

"మనిషన్నప్పుడింత బూమి లేకుంటె నల్లమొకమయిద్ది కొడుకుల్లార! గా బూమిని నమ్ముకొనే నేం బతికిన. గిన్నేండ్లు గడిసినయి. ఇంక రొండు మూడేండ్లు బతుకుత గావచ్చు. గీంత నా పానం బొయ్యెదాక గా బూమినట్లనే ఉంచుండ్రి కొడుకులార! గదాని మీన నట్టమచ్చినా మంచిదే. ఎట్లనన్న జేసి దానిమీదున్న బాకీల్దీరువుండ్రి. గిదొక్కటే నేను మిమ్ముల కోరుకుంటన్న" అని గొడగొడేడ్సిండు రామయ్య.

రామయ్యకు గా మడిసెక్క మీదున్న మమకారం జూసి నా కండ్లు చెమర్చినయి.

"గీ వయిసుల ముసలయినెను కట్ట పెట్టకుండ్రి. అండ్లేం పండకున్న మంచిదెగని గా బూమి అమ్మకుండ్రి" అని రామయ్య కొడుకులతోని సెప్పి నేనెల్లిపోయిన.

రామయ్య తరమోల్లకు బూమి మీదున్నంత పేమ అల్ల కొడుకులకు లేకగావచ్చు, లేకపోతె ఆరామయ్య బాదను కొడుకులరుతం సేసుకోకపోవచ్చు. ఒకవేళ సేసుకున్నా అల్ల ఆర్థిక పరిస్థితి అల్లకు మద్దతియ్యక గావచ్చు. ఏమైందో తెలువది గని రామయ్యెంత మొత్తుకున్నా గని ఇనక ఆ బూమినమ్మి బాకి గట్టిండ్రు. ఈ సంగతి నాకటెనుక ఎరుకయింది.

ఇసోంటి యెన్నో జరుగుతనే ఉన్నయి. తరాలమధ్య అంతరాలతోని మనుషుల ఆలోచనల్లు మారుతున్నయి. మనుషులంత మారుతండ్రు. మునుపటోల్లకంటె ఈతరమోల్లు డబ్బు మనుషులవు తండ్రు. అది వీళ్ళకు, ఇది వాళ్ళకరుతమయితలేదు. గందుకే గీ తండ్లాటలు........"!

★★★